చిరుద్యోగుల ఆకలి కేకలు

- స్కూళ్లలో ఆయాలు, నైట్ వాచ్‌మన్‌లకు 5 నెలలుగా అందని జీతాలు
- డివిజన్ వ్యాప్తంగా వేతనాల కోసం 556 మంది ఎదురుచూపులు
- రూ.1.66 కోట్ల మేర బకాయిలు



నిడదవోలు మండలం సమిశ్రగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల

కొవ్వూరు: ప్రభుత్వ పాఠశాలల ఆయాలు, నైట్ వాచ్‌మన్‌లుగా ఆకలితో అలమటిస్తున్నారు. చిరుద్యోగులైన వారికి నాలుగు నెలలుగా వేతనాలు అందడం లేదు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ప్రతి 300 మంది విద్యార్థులకు ఒక ఆయా చొప్పున నియమించారు. ఏడాదిలో పది నెలల కాలానికి వారికి ఒక్కొక్కరికి రూ.6 వేల చొప్పున వేతనాలు చెల్లిస్తున్నారు.అలాగే ఒక్కో హైస్కూల్‌కు ఒక నైట్ వాచ్‌మెన్ చొప్పున నియమించారు. విద్యా సంవత్సరం ప్రారంభమై ఇప్పటికే ఐదు నెలలు కావస్తోంది. కొవ్వూరు డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల్లో 502 పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 39,497 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. డివిజన్ వ్యాప్తంగా 483 మంది ఆయాలు, 73 మంది వాచ్‌మన్‌లు పని చేస్తున్నారు.

రూ.1.66 కోట్ల మేర బకాయిలు

ప్రతి పాఠశాలకు టాయిలెట్స్ నిర్వహణ కింద ఆయాలు, వాచ్‌మన్‌లకు వేతనాలు చెల్లిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంతవరకూ ఈ సొమ్ము విడుదల కాకపోవడంతో, వేతనాలు అందక చిరుద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయాలు, నైట్ వాచ్‌మన్‌లు కలిపి డివిజన్‌లో 556 మంది ఉన్నారు. జూలై నెల నుంచి వారికి నాలుగు నెలల పాటు వేతనం చెల్లించడం లేదు. వారిలో ఒక్కొక్కరికి రూ.6 వేల చొప్పున నెలకు రూ.3,33,6000 లెక్కన, నాలుగు నెలలకు గాను రూ.1,33,44,000 విడుదల కావాల్సి ఉంది. అదీ గాక మరో పది రోజుల్లో నవంబర్ నెల కూడా ముగుస్తుంది. ఈ నెల కూడా కలుపుకుంటే వాచ్‌మన్‌లు, ఆయాలకు రూ.1,66,80,000 మేర వేతనాలు అందాల్సి ఉంది.

మండలాల వారీగా డివిజన్‌లోని ఆయాలు, వాచ్‌మన్‌ల వివరాలిలా..

మండలం	స్కూళ్ల సంఖ్య	విద్యార్థుల సంఖ్య	పనిచేస్తున్న ఆయాలు	వాచ్‌మన్‌లు
చాగల్లు	38	3,309	45	07
దేవరపల్లి	45	5,209	53	08
గోపాలపురం	51	4,938	57	09
కొవ్వూరు	53	5,348	59	10
నల్లజర్ల	51	5,236	57	08
నిడదవోలు	69	5,899	79	10
పెరవలి	48	3,017	52	17
తాళ్లపూడి	32	3,130	36	06
ఉండ్రాజవరం	40	3,445	45	08

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై ఐదు నెలలు కావస్తోంది. ఈ ఏడాది ఇంత వరకూ జీతాలు చెల్లించలేదు. జూలై, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల జీతం రావాల్సి ఉంది. నాలుగేళ్లుగా ఆయాగా పని చేస్తున్నా. జీతాలు సకాలంలో అందకపోవడంతో ఇబ్బంది కరంగా ఉంది. ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలు చెల్లించాలి. పాఠశాలలను శుభ్రం చేయడం కీలక భూమిక పోషిస్తున్న ఆయాలకు సకాలంలో జీతం చెల్లించి ఆదుకోవాలి. జీతాలు అందడం లేదని ఇటీవల ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశాం.

– పాతాళ రాధ, ఆయా, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొవ్వూరు

బడ్జెట్ రావాల్సి ఉంది

ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాలు, వాచ్‌మన్‌లకు నాలుగు నెలల జీతాలు చెల్లి ంచాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి బడ్జెట్ విడుదల కావాల్సి ఉంది.బడ్జెట్ విడుదలైన వెంటనే జీతాల చెల్లింపునకు చర్యలు తీసుకుంటాం. ఈ వారంలో నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది.

– కె.వాసుదేవరావు, జిల్లా విద్యాశాఖాధికారి

గోకర్ణేశ్వర స్వామికి రుద్రాభిషేకం


ప్రత్యేక అలంకరణలో కె.సావరం దుర్గా మల్లేశ్వరస్వామి

ఉండ్రాజవరం: స్థానిక బాలాత్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వర స్వామి వారికి బుధవారం ప్రత్యేక పూజలతో పాటు ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కార్తిక మాసంలోని ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్వామి వారికి తెల్లవారుజాము నుంచి 11 రకాల ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అలాగే కె.సావరం గ్రామంలోని దుర్గామల్లేశ్వర స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష పత్రి పూజ నిర్వహించారు. వెలగదుర్రు గ్రామంలో కొలువైన విశ్వేశ్వర, మల్లేశ్వరస్వామి వార్ల ఆలయ ప్రాంగణంలో జ్యోతిర్లింగార్చన చేశారు. మహిళలు కార్తిక దీపాలు వెలిగించారు. స్వామివార్లకు అభిషేకాలు, పూజలు, విశేష అలంకరణలు చేశారు.

క్లుప్తంగా

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి


చాగల్లు సచివాలయంలో ఆధార్ నమోదు శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీదేవి

చాగల్లు: గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేస్తున్న ఆధార్ ప్రత్యేక నమోదు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎ. శ్రీదేవి సూచించారు. చాగల్లు-1, చాగల్లు-2 సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఆధార్ ప్రత్యేక నమోదు కేంద్రాలను బుధవారం ఎంపీడీవో శ్రీదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, 0-6 వయస్సు పిల్లలకు కొత్తగా ఆధార్ నమోదు చేయకపోతే వెంటనే చేసుకోవాలని అన్నారు. గ్రామ సచివాయాల్లో, ప్రభుత్వ పాఠశాలలు వద్ద ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లజర్ల: వార్షిక మరమ్మతుల నిమిత్తం అనంతపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ నారాయణ అప్పారావు తెలిపారు. అనంతపల్లి, చోడవరం, సంజీవపురం, వీరవల్లి, కృష్ణమ్మగూడెం గ్రామాల్లో త్రీఫేజ్ కరెంట్ సరఫరా ఉదయం 5 నుంచి 9 గంటల వరకూ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుందన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగండి


గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న కొవ్వూరు డీఎస్పీ దేవరకుమార్

గోపాలపురం: తమ సమస్యల పరిష్కారం కోరుతూ పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలని కొవ్వూరు డీఎస్పీ జి.దేవరకుమార్ సూచించారు. అప్పుడే ఫిర్యాదుదారుల సమస్యలను సులువుగా తెలుసుకుని, పరిష్కరించడానికి వీలవుతుందన్నారు. వార్షిక తనిఖీలలో భాగంగా బుధవారం ఆయన గోపాలపురం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చట్టం ఎవ్వరికీ చుట్టం కాదని, తప్పు చేస్తే ఎంతటివారినైనా శిక్షిస్తుందన్నారు. ఫిర్యాదుదారులు ధైర్యంగా వచ్చి వారి సమస్యలను పోలీసులకు వివరించవచ్చన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి సైబర్ నేరాలపై దృష్టి సారించాలని ఎస్సై కర్రి సతీష్‌కుమార్‌కు సూచించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం


అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న తహసీల్దార్, స్థానిక నాయకులు

నిడదవోలు రూరల్: మండలంలోని తాడిమళ్ల అగ్నిప్రమాద బాధితులకు ప్రభుత్వం తరపున బుధవారం నిత్యావసర సరకులు అందజేశారు. ఈనెల 19వ తేదీ రాత్రి విద్యుదాఘాతంతో తాటాకిల్లు దగ్ధమై నిరాశ్రయులైన దిరిసిమిల్లి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ తరపున రూ.10 వేల ఆర్థిక సాయంతో పాటు 25 కేజీల బియ్యం, కందిపప్పు, పంచదార, వంటనూనె, కూరగాయలు అందజేసినట్టు తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ బయ్యే రాధారాణి, జనసేన మండల శాఖ అధ్యక్షుడు పోలిరెడ్డి వెంకటరత్నం, ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల నాగేశ్వరరావు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాల నిర్వహణకు చర్యలు

జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు

సాక్షి ఇంపాక్ట్

నిడదవోలు రూరల్: గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాల నిర్వహణకు చర్యలు తీసుకున్నామని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. 'వైద్య శిబిరాలకు మంగళం' అనే శీర్షికన 'సాక్షి'లో బుధవారం ప్రచురించిన కథనానికి వైద్య ఆరోగ్య శాఖాధికారులు స్పందించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నామన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు తగు చర్యలు తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు. వైద్య శిబిరాల ఏర్పాటుతో పాటు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తాడిమళ్ల, కానూరు పీహెచ్‌సీల వైద్య సిబ్బందిని వెంకటేశ్వరరావు ఆదేశించారు.

రిలయన్స్ బయో ఎనర్జీపై భిన్నాభిప్రాయాలు

- ప్లాంట్ ఏర్పాటుపై అపోహలు తొలగించాలి
- స్థానికులకు 75 శాతం ఉపాధి కల్పించాలని డిమాండ్
- దొమ్మేరులో అవగాహన సదస్సు


అవగాహన సదస్సులో ప్రజాభిప్రాయాలు తెలుసుకుంటున్న కంపెనీ ప్రతినిధులు

కొవ్వూరు: ఐ.పంగిడి గ్రామంలో నిర్మాణంలో ఉన్న రిలయన్స్ బయో ఎనర్జీ పరిశ్రమపై స్థానికులు అపోహలు విడనాడాలని ఆ కంపెనీ ప్రతినిధులు స్పష్టం చేశారు. దొమ్మేరులోని ఓ ఫంక్షన్ హాలులో బుధవారం గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానికుల సందేహాలను, సమస్యలకు ప్లాంట్ మేనేజర్లు ఆనంద్‌కుమార్, కిరణ్ కుమార్‌లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నివృతి చేశారు. రూ.250 కోట్లతో రెండు బయో ఎనర్జీ ప్లాంట్‌లుగా దీనిని నిర్మిస్తున్నామన్నారు. కాకినాడలో మూడు, రాజమహేంద్రవరంలో రెండు,నెల్లూరు, కర్నూలు, విజయవాడల్లో ఒక్కొక్కటి చొప్పున బయో ఎనర్జీ ప్లాంటులు నిర్మాణంలో ఉన్నాయన్నారు.ఈ ప్లాంట్లలో తయారయ్యే కంప్రెషర్ బయో గ్యాస్ వలన ఎలాంటి ప్రమాదం గాని, కాలుష్యం గాని ఉండదన్నారు.

ఈ సమస్యలు పరిష్కరించండి

మాజీ ఎంపీపీ పీకే రంగారావు మాట్లాడుతూ ఈ ప్లాంట్ ఏర్పాటుతో కాపవరం, ఐ.పంగిడి గ్రామాల ప్రజలకు ఎలాంటి ప్రమాదం ఉండదన్న అంశాన్ని ఎందుకు ప్రచారం చేయడం లేదని ప్రశ్నించారు. ప్లాంట్ ఉత్పత్తిని ప్రారంభిస్తే ఏవైనా విష వాయువులు వెలువడతాయా? ఉత్పత్తి చేసే గ్యాస్‌తో ఏమైనా ప్రమాదం ఉందా, కాలుష్యం ఏమేరకు ఉంటుందన్న అంశాలను ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్లాంటులో 75 శాతం మంది స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని సూచించారు. పొట్రు సిద్ధూ, అల్లాడి దుర్గా ప్రసాద్ కూడా పలు అంశాలను ప్రస్తావించారు. సర్పంచ్ గోశాల నాగర్జున, వైస్ ఎంపీపీ వీరమల్ల నారాయుడు, ఎంపీటీసీ సభ్యుడు ఎరుబండి సురేష్, ఉప్పులూరి వెంకట ఫణి కృష్ణారావు (నానాజీ), పాలడుగుల శ్రీనివాస్, కొప్పాక విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం కొనుగోలుచేస్తే క్రిమినల్ కేసులు

- జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రసాద్
- చాగల్లు, నిడదవోలు మండలాల్లో తనిఖీలు


చాగల్లు మండలం కలవలపల్లిలో తనిఖీలు చేస్తున్న సివిల్ సప్లయ్ అధికారులు

చాగల్లు: రేషన్ బియ్యం అక్రమ రవాణా నిరోధానికి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్టు జిల్లా పౌరసరఫరాల అధికారి కేవీఎస్ఎం ప్రసాద్ అన్నారు. బుధవారం చాగల్లు మండలం కలవలపల్లి, నిడదవోలు మండలం సూరాపురం గ్రామాల్లోని పలు ప్రాంతాల్లో ఈ బృందం తనిఖీలు నిర్వహించింది. రేషన్ బియ్యం అమ్మకాలు, కొనుగోళ్ల సాగిస్తున్నారనే ఫిర్యాదులు రావడంతో ఫణికుమార్, మెట్టపర్తి రాజు, కోలా రాజేష్, వద్దిరెడ్డి దుర్గారావు అనే వారి నివాస గృహాల్లో ఈ బృందం తనిఖీలు జరిపింది. అనంతరం కోళ్లఫారాల్లో తనిఖీలు చేపట్టారు. అయితే ఈ తనిఖీల్లో రేషన్ బియ్యం లభ్యం కాలేదు. ఈ సందర్భంగా కేవీఎస్ఎం ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి నెలా 1 నుంచి 17వ తేదీ వరకూ ప్రత్యేక బృందాలతో ఆకస్మిక తనిఖీలకు ఏర్పాట్లు చేశామన్నారు. రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నారంటూ మోటర్‌సైకిల్ వాహనదారులు, రైస్‌మిల్లులు, కోళ్లఫారాల యాజమాన్యాలపై ఫిర్యాదులు వస్తే, దాడులు జరిపి, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రెండోరోజూ కొనసాగిన తనిఖీలు

నిడదవోలు రూరల్: అక్రమంగా రేషన్ బియ్యం రవాణా, విక్రయాలు జరిపిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నామని జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి కేవీఎస్ఎం ప్రసాద్ స్పష్టం చేశారు. మండలంలోని సూరాపురంలో రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నారని ఫిర్యాదుల మేరకు ఫణికుమార్, ఎం.రాజు, కోలా రాజేష్ ఇళ్లల్లో సివిల్ సప్లయిస్ అధికారుల బృందం బుధవారం రెండోరోజు తనిఖీలు నిర్వహించారు. ఈ బృందంలో కొవ్వూరు ఏఎస్‌వో ఎం.నాగాంజనేయులు, నిడదవోలు, రాజానగరం, పెరవలి, కొవ్వూరు, దేవరపల్లి సివిల్ సప్లయిస్ డీటీలు ఎం.అనిల్, జి.బాపిరాజు, ఎస్ఎస్ సుధీర్‌రెడ్డి, ఎం.సునీత, ఎ.సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ప్రకృతి సాగు పద్ధతులు లాభదాయకం



దొమ్మేరులో పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు తదితరులు

పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

కొవ్వూరు: ప్రకృతి వ్యవసాయం వల్ల పెట్టుబడులు తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు పేర్కొన్నారు. మండలంలోని దొమ్మేరు, ధర్మవరం గ్రామాల్లోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను బుధవారం పరిశీలించారు. దొమ్మేరులో ముదునూరి నీలాద్రిరాజుకు చెందిన ఎకరం పొలంలో ప్రకృతి విధానంలో సాగు చేస్తున్న కంద, ఆనబ, మామిడి, బొప్పాయి, చెరకు, పనస, పైనాపిల్, మునగ, చిలకడదుంపలు, కాకర, కరివేపాకు, అరటి తదితర పంటలను అధికారుల బృందం పరిశీలించింది. అలాగే ధర్మవరంలో బయోకల్చర్ కషాయాల సాయంతో సాగు చేస్తున్న పలు రకాల పండ్ల పంటలను కూడా పరిశీలించారు. గట్లపై కూరగాయల మొక్కలు వేయించాలని అధికారులు సూచించారు. దొమ్మేరులో గాదిరాజు రామకృష్ణకు చెందిన పదెకరాల పొలంలో సాగవుతున్న అరటి, నవధాన్యాలు, అరటిలో అంతర పంటగా పసుపు సాగును పరిశీలించారు. ఐ.పంగిడి, దొమ్మేరు గ్రామాల్లో పలువురు రైతులు సాగు చేస్తున్న దొండ, ఆగాకార, పొట్ల, బీర, చిలగడ దుంప, వంగ, పచ్చి మిర్చి పంటలను కూడా పరిశీలించారు. గోకృపామృతం, వేప పిండి కషాయం, మీనామృతం తయారీ, వాడే విధానాలను పరిశీలించి పలుర కాల సూచనలు చేశారు. ప్రకృతి వ్యవసాయం విభాగం అధికారి తాతారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

గోపాలపురం: జాతీయ రహదారులపై తరహాలో గ్రామీణ రోడ్లపై టోల్ ప్లాజాలు ఏర్పాటు చేసి ప్రజలపై ఆర్థికభారం మోపాలని సీఎం చంద్రబాబు ప్రతిపాదించడం దారుణమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని వెల్లచింతలగూడెంలోని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మట్టపర్తి రామమోహన్‌రావు నివాసం వద్ద బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో విశ్వేశ్వరరెడ్డి మాట్లాడారు. గ్రామీణ రోడ్లపై టోల్ ప్లాజాలు ఏర్పాటు చేయాలని లేని పక్షంలో అవి గుంతల రోడ్లుగానే ఉంటాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీలో ప్రకటించడం సిగ్గుచేటన్నారు. సంపద సృష్టిస్తామంటూ ఎన్నికల వేళ హామీలు ఇచ్చిన కూటమి నేతలు, ఇప్పుడు అప్పుల్లో ఉన్నామని చెబుతూ టోల్ ప్లాజాల పేరుతో రాష్ట్ర ప్రజలపై అధిక భారం మోపాలని చూడడం దారుణమన్నారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, పీసీసీ సభ్యుడు జేష్ట సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

నిడదవోలు రూరల్: కలుపు మందు తాగిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమిశ్రగూడెం ఎస్సై కె.వీరబాబు బుధవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కోరుమామిడి గ్రామానికి చెందిన యజ్జవరపు ఆదిలక్ష్మి (42) కుమార్తె ప్రేమించి ఇంటి నుంచి వెళ్లిపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఈనెల 19న కలుపు మందు తాగింది. దీంతో రాజమహేంద్రవరంలోని జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా బుధవారం ఉదయం ఆదిలక్ష్మి మృతి చెందినట్లు భర్త సత్తిబాబు ఫిర్యాదు ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పార్కు పనులు వేగవంతం చేయాలి

నిడదవోలు: స్థానిక గణపతి జంక్షన్‌లో చేపట్టిన 'ఐ లవ్ నిడదవోలు' పార్కులో సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ఆదేశించారు. బుధవారం పార్కులో జరుగుతున్న పనులను మున్సిపల్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ కుడా నిధులు రూ.67 లక్షల వ్యయంతో చేపట్టిన పార్కు సుందరీకరణ పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. కడియపులంక నుంచి తెప్పించిన మొక్కలు, లాన్, విద్యుత్ దీపాలు, స్టాట్యూ నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయన్నారు.

యూటీఎఫ్ మండల శాఖల నూతన కార్యవర్గాలు


దేవరపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామారావు


ప్రధాన కార్యదర్శి కొల్లి శ్యాంసుందర్

దేవరపల్లి: ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) దేవరపల్లి మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల్లో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో నూతన కౌన్సిల్‌ను ఎన్నుకున్నారు. నూతన కౌన్సిల్ ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి సీహెచ్ మనోహర్, పరిశీలకుడిగా జిల్లా గౌరవాధ్యక్షుడు ఉస్సే శంకరుడు వ్యవహరించారు. నూతన కౌన్సిల్ మండలశాఖ అధ్యక్షుడిగా లింగంకుంట రామారావు, ప్రధాన కార్యదర్శిగా కొల్లి శ్యాంసుందర్, గౌరవాధ్యక్షుడిగా ఓరుగంటి శివనాగప్రసాదరాజు, ఉపాధ్యక్షుడిగా మర్రి అబ్బులు, మహిళా అధ్యక్షురాలిగా ఎ.నర్సమ్మ, కోశాధికారిగా కొమారపు ఉమాకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఉండ్రాజవరం మండలం..

ఉండ్రాజవరం: స్థానిక నంబర్-1 ప్రాథమిక పాఠశాలలో బుధవారం నిర్వహించిన సమావేశంలో యూటీఎఫ్ మండలశాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా వైవీ స్వామి, ప్రధాన కార్యదర్శిగా బి.రామారావు, గౌరవాధ్యక్షుడిగా ఎస్.లక్ష్మీనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్.తాతారెడ్డి, అసోసియేట్ మహిళా అధ్యక్షురాలిగా ఎం.వెంకటలక్ష్మి, కోశాధికారిగా కె.రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కార్యదర్శులుగా ఆర్ఎస్ఆర్ ఫణి, జి.శివప్రసాద్, ఎ.రత్నాకర్‌చౌదరి, ఎస్.మీరాసాహెబ్, సీహెచ్ శ్రీనివాసు, పి.సత్యనారాయణ, టి.పరమపావని, ఎస్‌జీ రజియా, ఎం.సుధాకర్ ఎన్నికయ్యారు. జిల్లా మహాసభ ప్రతినిధులు గా పి.వీరాంజనేయులు, ఎ.సూర్యకుమారి, ఎం.సునీత, ఆర్.సురేష్, డి.శ్రీనివాస్, ఎల్.అమ్మిరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు


తాము సాధించిన బహుమతులతో నిడదవోలు ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

విజేతలకు బహుమతుల ప్రదానం

నల్లజర్ల: గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. వారోత్సవాలను పురస్కరించుకుని నల్లజర్ల శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు జెడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. తహసీల్దార్ కృష్ణారావు, ఎంఈఓ సత్యనారాయణ, శాఖా గ్రంథాలయం చైర్‌పర్సన్ జి.సుశీల, గ్రంథపాలకురాలు ఏవీ రమణ, నాయకులు వల్లూరి సత్తిపండు, జి.సుబ్బారావు, గొట్టిపాటి శ్రీరామ్మూర్తి, స్కూల్ చైర్మన్ కోడూరి నారాయణరావు, యలమాటి ఆనంద్ పాల్గొన్నారు.

నిడదవోలు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, పాటలు, చిత్ర లేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. చివరి రోజైన బుధవారం విజేతలైన విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఓ జ్యోతి బహుమతులు అందజేశారు.

ఉండ్రాజవరం: గ్రంథ పఠనం ద్వారా విద్యార్థులు తమ విజ్ఞానాన్ని పెంపొందించుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ సూచించారు. ఉండ్రాజవరం శాఖా గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయాధికారి గుత్తికొండ కృష్ణారావు ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. వారం రోజులుగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్, మ్యూజికల్ చైర్స్, చదరంగం, ముగ్గుల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.రామారావు, స్థానిక ఉన్నత పాఠశాల హెచ్ఎం మాణిక్యాలరావు, డ్రాయింగ్ టీచర్ బొడ్డేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చాగల్లు: చాగల్లు, చంద్రవరం శాఖా గ్రంథాలయాల్లో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ పోటీల్లో విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కవి ప్రసాద్, గ్రంథాలయ సంస్థ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.వీరభద్రరావు, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం పి.వీర్రాజు, రిటైర్డ్ టీచర్ వెత్స గంగాధరం, గ్రంథాలయాధికారులు గద్దె శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

దేవరపల్లి: యర్నగూడెం, దేవరపల్లి శాఖా గ్రంథాలయాల్లో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. విజేతలకు వారోత్సవాల ముగింపు సందర్భంగా బహుమతులు అందజేశారు. యర్నగూడెం శాఖా గ్రంథాలయంలో జరిగిన సభలో ఎంఈఓ ఎం. తిరుమలదాస్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఛత్రపతి శివాజీ, గ్రంథాలయ అధికారి అనిత, గ్రాస్తులు పాల్గొన్నారు.

అనంతపల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం


అనంతపల్లిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

నల్లజర్ల: అనంతపల్లి జెడ్పీ హైస్కూల్ 1986–87 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు బుధవారం ఆ గ్రామంలోని స్వర్ణ దుర్గాశ్రమంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తొలుత ఉసిరి చెట్టు వద్ద వారు కార్తిక పూజలు నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పూర్వ విద్యార్థులు ఈ వేడుకకు తరలి వచ్చారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ గత స్మృతులను నెమరు వేసుకున్నారు. ఆటపాటలతో సాయంత్రం వరకూ ఉల్లాసంగా గడిపారు. ఏలూరులో ఉంటున్న సహ విద్యార్థిని దమయంతి ప్రస్తుతం అనారోగ్యంతో ఉంది. ఆమె చికిత్స నిమిత్తం రూ.20 ఆర్థిక సాయంగా అందజేశారు. పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చి ఆమెకు మెరుగైన వైద్య సాయం అందించాలని ప్రతిపాదించారు.